క్లుప్తంగా

లెక్కల్లో ముగ్గురు.. పనిచేసేది ఆరుగురు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్లుగా ముగ్గురు పనిచేయాల్సి ఉండగా.. ఆరుగురుని నియమించారు. మిగిలిన ముగ్గురికి ఉపాధి కల్పించడం ఆమోదయోగ్యమే అయినప్పటికీ.. నిబంధనల ప్రకారం కొనసాగుతున్న వారికి ఆన్‌లైన్ ద్వారా వేతనాలు ఇచ్చి, మిగిలిన ముగ్గురికి మాత్రం 9 నెలలుగా ఇవ్వకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. పంచాయతీ కార్మికులు మల్లూరు, పద్మ, రమణలు తొమ్మిది నెలలుగా వేతనాలు రాక కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ముగ్గురు కార్మికులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వరప్రసాద్‌ను కలిసి తమ సమస్య విన్నవించారు. ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శి జ్యోతితో మాట్లాడగా.. వీరి వేతనాలకు సంబంధించి జనరల్ ఫండ్ చెక్కు ట్రెజరీకి పంపామని, చెక్కు పాస్ అవలేదని చెప్పుకొచ్చారు. అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు.

ట్రెండింగ్‌లో మట్టి వాటర్ బాటిళ్లు


విక్రయానికి సిద్ధంగా మట్టి బాటిళ్లు

భద్రాచలంటౌన్: పట్టణాల్లో మట్టితో తయారు చేసిన వాటర్ బాటిల్ ప్రజలను ఆకటుకుంటున్నాయి. వేసవిలో చల్లటి నీటి కోసం ఫ్రీజ్‌లో పెట్టిన నీరు కాకుండా ఈ మట్టి బాటిల్‌లో నీటిని తాగడం ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. పూర్వం గ్రామాల్లోని ప్రజలు వేసవి కాలంలో ఆనప బూరకు నాప నార చుట్టి ప్రయాణాలు చేసే సమయంలో తమ వెంట తీసుకువెళ్లేవారు. కాలక్రమేపి ప్లాస్టిక్‌తో పాటు స్టీల్ వాటర్ బాటిల్స్ అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ప్లాస్టిక్ స్థానంలో ఆరోగ్యంతోపాటు, చల్లదానాన్నిచ్చే మట్టి వాటర్ బాటిల్స్‌ను వినియోగిస్తున్నారు.

కలెక్టర్‌కు సీపీఎం వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

మణుగూరురూరల్: సీతారామ ప్రాజెక్ట్ నీళ్లను మణుగూరు ప్రాంత రైతులకు అందించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు మణుగూరు భూభారతి చట్టంపై అవగాహన సదస్సుకు వచ్చిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సత్రపల్లి సాంబశివరావులు మాట్లాడుతూ.. మండలంలో సింగరేణి ఓసీ భూనిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని, బీటీపీఎస్ రైల్వేలైన్‌లో భూములు కోల్పోయిన రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొడిశాల రాములు, హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్‌ల పంపిణీ


ఉపాధ్యాయులకు నోట్‌బుక్స్ అందిస్తున్న ఎంఈఓ ఆనంద్‌కుమార్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని పాఠశాలలకు సోమవారం నోట్‌బుక్‌లను ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్ పంపిణీ చేశారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చొరవతో ఐటీసీ సంస్థ అందించిన నోట్‌బుక్‌లను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. వేసవిలో చేతిరాతను మెరుగుపరుచుకునేందుకు ప్రతి విద్యార్థికీ రెండు నోట్‌బుక్‌లు ఇవ్వనున్నట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు ఏ.వెంకటేశ్వర్లు, సీసీఓ వెంకటరమణ, సీఆర్‌పీలు శిరీష, నాగమణి పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

దమ్మపేట: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. మండలంలోని మల్లారం, అప్పారావుపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పూలు, పండ్లు అందజేసి సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు పలకలను అందజేసి, అక్షరాలను దిద్దించారు. కార్యక్రమంలో సీడీపీఓ హేమలత, సూపర్‌వైజర్ సాలమ్మ, అంగన్‌వాడీలు స్రవంతి, అలివేలు పాల్గొన్నారు.

రహదారికి ఎదురుచూపులు

- శంకుస్థాపన చేసి ఐదు నెలలు
- టెండర్ ప్రక్రియలో ఆలస్యం
- భారీ గోతితో ఇబ్బంది పడుతున్న ప్రజలు


రహదారి మధ్యలో ఏర్పడిన భారీ గొయ్యి


అధ్వానంగా ఉన్న అచ్చితాపురం రహదారి

దుమ్ముగూడెం: రహదారి సమస్యతోపాటు దారి మధ్యలో ఉన్న కల్వర్టుకు గొయ్యి పడి మండలంలోని అచ్చితాపురం గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని లక్ష్మీనగరం నుంచి అచ్చితాపురం గ్రామం వరకు రహదారి అంతా గోతులమయంగా మారింది. రహదారి మధ్యలో ఉన్న కల్వర్టుకు భారీ గొయ్యి పడి పెద్ద వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. రాత్రి వేళల్లో ఆ గొయ్యి కనపడక దాంట్లో పడితే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం ఉంది.

ఐదు నెలల క్రితం శంకుస్థాపన..

గత ఏడాది నవంబర్ 26న లక్ష్మీనగరం నుంచి వయా అచ్చితాపురం మీదుగా గంగోలు ఆర్అండ్‌బీ రహదారి వరకు సీఆర్ఆర్ నిధులు రూ.2.80 కోట్లతో బీటీ రహదారి నిర్మించేందుకు గాను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శంకుస్థాపన చేశారు. కానీ ఐదు నెలలు గడిచినా నేటి వరకు ఎటువంటి పురోగతీ లేదు.

కాంట్రాక్టర్లు ముందుకు రాక..

సీఆర్ఆర్ నిధులు రూ.2.80కోట్లతో లక్ష్మీనగరం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఎంపీడీఓ కార్యాలయం మీదుగా వయా అచ్చితాపురం మీదుగా గంగోలు గ్రామం వరకు బీటీ రహదారి నిర్మించడానికి ఇప్పటికి రెండు సార్లు టెండర్లను పిలిచారు. ఆ టెండర్లు దక్కించుకునేందుకు గుత్తేదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభానికి ఆటంకం ఏర్పడినట్లు పంచాయతీరాజ్ అధికారులు తెలుపుతున్నారు.

ఎన్నాళ్లీయాతన..

మా గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టాలని భారీ గొయ్యి పడ్డ దగ్గర కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఎన్నిసార్లు విన్నవించినా చెవిటోడి ముందు శంఖం ఊదిన చందంగానే ఉంది. గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం ఆవేదన కలుగచేస్తోంది. ఇప్పటికైనా అధికారులు పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– సోయం కామరాజు,
ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నాడు ఎన్నికల బహిష్కరణ

తాజా అసెంబ్లీ ఎన్నికల సమయంలో గ్రామస్తులు రహదారి సమస్యను పరిష్కరించాలని ఎన్నికలను బహిష్కరించారు.

అప్పటి భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హుటాహుటీన అచ్చితాపురం గ్రామానికి వచ్చి ఎన్నికల అనంతరం రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో స్థానికులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ప్రస్తుతం ఎన్నికలు అయ్యి.. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్నా నేటికీ ఆ రహదారి సమస్య తీరలేదు.

‘బడిబాట’లో ఎమ్మెల్యే


వడ్లగూడెం యూపీఎస్‌లో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని మొండివర్రే కాలనీ, సరోజనాపురం, నాగుపల్లి, నాచారం, చలమప్పగూడెం, తొట్టిపంపు, మొద్దులగూడెం, వడ్లగూడెం గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. ఆ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆదర్శ పాఠశాల నిధుల ద్వారా పూర్తయిన తాగునీరు, టాయిలెట్లు, తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. నాగుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో క్రీడల్లో ప్రతిభ చాటుతున్న 9వ తరగతి విద్యార్థి రేసు రామ్‌చరణ్ తేజ్‌కు, మాజీ హెచ్ఎం ప్రభుదాస్ ఆర్థిక సహకారంతో క్రీడా దుస్తులు, బూట్లను ఆయన అందజేశారు. నాచారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వడ్లగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని ఆరగించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు నరేష్, ఎంపీడీఓ రవీంద్రా రెడ్డి, ఎంఈఓ కీసర లక్ష్మి, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో ‘పోషణ పక్వాడ’



మాట్లాడుతున్న కళాశాల డీన్ డాక్టర్ హేమంత్ కుమార్

అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడలో భాగంగా విద్యార్థినులకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే ఔషధంలా పని చేస్తుందని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, కళాశాల సిబ్బంది డాక్టర్ కె.నాగాంజలి, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ కె.శిరీష, డాక్టర్ పి.నీలిమ, విద్యార్థినులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్సై రాజశేఖర్

ములకలపల్లి: అపరిచిత వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కిన్నెర రాజశేఖర్ సూచించారు. సైబర్ నేరాలపై ములకలపల్లి గుడ్‌షపర్డ్ సిస్టర్స్ ఆధ్వర్యంలో రింగిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. నేటి జీవనం సెల్‌ఫోన్ భాగమైందని, ఐతే అపరిచిత వ్యక్తులతో సంభాషణ, వాట్సాప్ లింక్‌లు క్లిక్ చేయడం, నూతన యాప్‌లను వినియోగించడం చేయవద్దని సూచించారు. సైబర్ నేరాలపట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. సిస్టర్ నిర్మల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు చలువ పందిళ్లు


భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీకి ఏర్పాటు చేసిన గ్రీన్ మ్యాట్

భద్రాచలంఅర్బన్: పల్లెలు, పట్టణాలు పచ్చదనం పెంపొందించేందుకు గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టగా.. నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు పెరుగుతున్నాయి. నిర్వాహకులు పండ్ల మొక్కలతో పాటు ఆయా రకాల మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగానే భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలో నర్సరీని ఏర్పాటు చేసి, వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. అయితే అవి ఎండిపోకుండా వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు చర్యలు చేపడుతున్నారు. నర్సరీలో మొక్కలపై చలువ పందిళ్లను (గ్రీన్ మ్యాట్లు) రక్షణ కోసం వేయిస్తున్నారు. చలువ పందిళ్ల కోసం మొక్కల సంఖ్యకు అనుగుణంగా నర్సరీకి రూ.25 వేలు ఖర్చు చేసినట్లు సమాచారం.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని మహాత్మజ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలుర కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీఓ సీహెచ్ రాంబాబు, కళాశాల ప్రిన్స్‌పాల్ ఎస్‌కె.బురాన్‌లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ (ఎంపీసీ), బీఎస్సీ (బీజెడ్‌సీ), బీకాం (సీఏ), బీఏ (హెచ్‌పీసీ)ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మే నెల 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర సమాచారం కోసం 9059490623, 8500006021 నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా కోరారు.

28న ‘భూభారతి’పై సదస్సు

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 28వ తేదీన అశ్వారావుపేటలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు స్థానిక తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తీసుకొచ్చిన భూభారతిపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ హాజరై.. భూభారతి గురించి రైతులకు అవగాహన కల్పించడంతోపాటు రైతుల సందేహాలను తీరుస్తారని వివరించారు. ఈ కార్యక్రమానికి రైతులంతా సకాలంలో హాజరై విజయవంతం చేయాలని తహసీల్దార్ కోరారు.

బకాయిలు చెల్లించాలి

ములకలపల్లి: ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు చెల్లించాల్సిన రెండు నెలల పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సంఘ మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.500 వేతనం చెల్లించాలని, ఎండతీవ్రతకు మరణిస్తే రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మాలోతు రావూజా, భూక్యా సామిని, పులి వెంకటేశ్వర్లు, ఓరుగంటి నరేశ్, కర్రి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన సోమవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని వినాయకపురం వద్ద గ్రామానికి చెందిన రామినేని సత్యనారాయణ అనే వ్యక్తి కాలినడక వెళ్తున్న క్రమంలో అశ్వారావుపేట నుంచి గుమ్మడవల్లి వైపు వెళ్తున్న ఆటో వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణతోపాటు ఆటోలో ఉన్న గుమ్మడవల్లి గ్రామానికి చెందిన ఎస్‌కె.సలీమాకు తల భాగాల్లో గాయాలయ్యాయి. గాయపడిన వారిని చిట్టిత ల్లి అంబులెన్స్‌లో అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఈ ఘటనపై లిఖిత పూర్వకంగా ఇంకా ఫిర్యాదు రాలేదని స్థానిక ఎస్సై యయాతి రాజు తెలిపారు.

తాలిపేరు నీరు అందించేందుకు కృషి


సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం: తన సొంత మండలమైన దుమ్ముగూడెం మండలంలో రైతాంగానికి రెండు పంటలు పండేందుకు తాలిపేరు నీరు అందించే విధంగా కృషి చేస్తానని భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారుడు మట్టా శేఖర్ ఇంట్లో ఆ కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు మట్టా శివాజీ ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి 1100 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, మే 1 నుంచి నిర్మాణానికి ముగ్గులు పోసే కార్యక్రమం చేపడతామని తెలిపారు. త్వరలోనే తూరుబాక దగ్గర ఉన్న కల్వర్టు నిర్మాణ పనులు, ఎస్.లక్ష్మీపురం దగ్గర హైలెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులు 46మందికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, సివిల్ సప్లై అధికారి రాజులు, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, అన్నె సత్యనారాయణమూర్తి, కుంజా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సెలవు అందుకేనా?

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్ సోమవారం సెలవుపై వెళ్లారు. అనారోగ్య కారణాలతో సెలవు పెట్టినప్పటికీ.. ఇతర కారణాలూ ఉన్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. గత శనివారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దమ్మపేట మండలం గండుగులపల్లిలోని క్యాంప్ ఆఫీసులో ఇందిరమ్మ ఇళ్లపై నియోజకవర్గస్థాయిలో సమీక్ష నిర్వహించారు. కాగా, ఇదే రోజు జెడ్పీ సీఈఓ కూడా ఇందిరమ్మ ఇళ్ల వివరాలతోపాటు స్థానిక మున్సిపాలిటీకి సంబంధించిన వివరాల కోసం ఆదేశించినట్లు సమాచారం. అయితే ఈ సమాచారాన్ని స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సకాలంలో సమర్పించకపోవడంపై ఉన్నతాధికారి అగ్రహించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో సోమవారం కూడా ఈ వివరాలపై మరోసారి ఉన్నతాధికారి నుంచి ఒత్తిడి రావడంతో, ఎంపీడీఓ అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవు పెట్టారు. ఈ పరిణామాలు చర్చనీయంశం కాగా.. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలను స్థానిక ఎంపీఓ సోయం ప్రసాద్‌కు ఇచ్చేందుకు ఉన్నతాధికారులు మొగ్గుచూపారు. అయితే ఎంపీఓ అందుకు తిరస్కరించినట్లు, దమ్మపేట ఎంపీఓకు ఆ బాధ్యతలు ఇవ్వనున్నట్లు తెలిసింది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలన


భూపాలపట్నంలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం

పినపాక: మండల పరిధిలోని భూపాలపట్నం పంచాయతీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. నాణ్యత పరిమాణాలతో ఇల్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంటి నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీల్ కుమార్, ఎంపీ ఓ వెంకటేశ్వరరావు, నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, కొరస కృష్ణంరాజు, ఉడుముల లక్ష్మిరెడ్డి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డంకులు తొలగించారు..


బస్‌షెల్టర్‌లో బైక్‌లు తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ములకలపల్లి: ములకలపల్లి బస్‌షెల్టర్‌లో ఏర్పాటు చేసిన తాగునీటిని చేరుకునేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శి రవి ఆధ్వర్యంలో పార్కింగ్ అడ్డంకులు తొలగించారు. జీపీ ఆధ్వర్యంలో బస్‌షెల్టర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేయగా.. షెల్టర్‌లో బైక్‌లు, బయట ఆటోలు పార్కింగ్ చేయడంతో ప్రజలు నీటి వద్దకు చేరుకునే దారి లేకుండా పోయింది. దీనిపై ఈ ఉదంతంపై ‘దాహార్తి తీరే దారేది’శీర్షికన సోమవారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన జీపీ అధికారులు షెల్టర్‌ను శుభ్రం చేయడంతోపాటు, షెల్టర్ పరిసరాల్లో వాహనాలు పార్కింగ్ చేయకూడదని స్పష్టం చేశారు.

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం


స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ములకలపల్లి: మంగలిగుట్ట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణ నడుమ, శాస్త్రోక్తంగా కల్యాణక్రతువును చేశారు. ఆలయ ధర్మకర్త రాయల కేధారేశ్వరరావు దంపతులతోపాటు, పలువురు దంపతులు పీటలపై కూర్చొని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భారీగా భక్తజనం హాజరుకాగా, జయజయ ధ్వానాల నడుమ కన్నులపండుగలా వేడుకలు నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, బిక్కుమళ్ల సుధాకర్, శనగపాటి శ్రీను, గొడ్ల రాజు, పాలకుర్తి సుమిత్, తదితరులు పాల్గొన్నారు.


ఫ్లెక్సీలతో పరేషాన్!


- భద్రాచలంలో ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు
- ప్రజలు, పర్యావరణానికి పెనుప్రమాదం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో స్థానికులను ఇబ్బందులకు గురిచేసేలా ఫ్లెక్సీలు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. అనధికారికంగా కొన్ని వందల సంఖ్యలో హోర్డింగులను ఏర్పాటు చేస్తున్నారు. వీటిల్లో కొన్ని రహదారులను ఆక్రమిస్తుంటే.. మరికొన్ని విద్యుత్ స్తంభాలు, డివైడర్లు ఇలా ఎక్కడిపడితే అక్కడ ఏర్పాటవుతున్నాయి. ముఖ్యంగా రాజకీయ నాయకులకు సంబంధించిన పుట్టిన రోజు, ఎన్నికల ప్రచారం, పండుగ రోజులకు శుభాకాంక్షల వాల్ బోర్డులు, ఫ్లెక్సీలు ఇష్టారీతిగా వెలుస్తున్నాయి. యాడ్ ఏజెన్సీలను సంప్రదించకుండానే ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ.. ఏజెన్సీలకు నష్టాన్ని మిగిల్చుతున్నారు. రాజకీయ నాయకులను చూసి కొందరు డాక్టర్లు, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు కూడా ప్రచార పర్వంలో హద్దులు దాటేస్తున్నారు. వీరందరిపై చర్యలు తీసుకున్న అధికారులు లేరు.

ప్రమాదకరంగా..

భద్రాచలం పట్టణ పరిధిలో ప్రకటనల కోసం ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల వీచిన గాలి ప్రభావం, కురిన వర్షంతో బ్రిడ్జి పాయింట్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డులు గాలి ప్రాభావానికి ఇరిగిపోయి కింద పడిపోయాయి. పలుచోట్ల రహదారి పక్కన ఏర్పాటు చేసిన హోర్డింగ్లు, ఫ్లెక్సీలు గాలికి కూలిపోయే ప్రమాదం ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు రోడ్లపైకి రావాలంటే జంకుతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతోందని భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకర హోర్డింగ్స్, ఫ్లెక్సీలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


ఇటీవల గాలి దుమారానికి భద్రాచలం బ్రిడ్జి పాయింట్‌లో పడిపోయిన ఫ్లెక్సీలు


పట్టణంలో నడిరోడ్డుపై ఏర్పాటు చేసుకున్న ప్రచార బోర్డులు